15112024-MAI-06_Layout 1 11/15/2024 2:31 AM Page 1



# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# 'బుల్డోజర్'కు అడ్డుకట్ట

యంత్రభూతాలు ఉక్కు పిడికిళ్లతో కలల లోగిళ్లను బద్దలు కొట్టే బీభత్స భయానక దృశ్యాలకు ఇకనైనా తెరపడుతుందా? సత్వర న్యాయం పేరిట జరుగుతున్న అరాచకానికి అడ్డుకట్ట ఎవరు వేస్తారు? బుల్డోజర్ పీడకలకు ముగింపు ఉందా? ఈ ప్రశ్నలకు సమాధానమే బుధవారం నాటి సుప్రీంకోర్టు తీర్పు. పరిపాలనా వ్యవస్థ నిరంకుశ, సంకుచిత విధానాలకు చెంపపెట్టు లాంటి ఈ తీర్పు బాధితులు ఎందరికో ఊరటనిస్తుందని చెప్పవచ్చు. ఒక వ్యక్తి చేసిన నేరానికి అతని కుటుంబాన్ని శిక్షించే విపరీత ధోరణికి తగిలించిన పేరే 'బుల్డోజర్ న్యాయం'. నిజానికి ఇది అన్యాయం, అక్రమం. నేరాభియోగాల పేరిట జరిపే దురన్యాయం ఇక చెల్లదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేయడం ముదావహం. 'నాకంటూ ఓ గూడు ఉండాలి.. తల మీద ఇంత నీడ ఉండాలి. ప్రతి ఒక్కరూ ఈ కలతోనే జీవిస్తారు. ఈ కల ఎన్నడూ దూరం కావద్దనేది ప్రతి మనసు కోరిక'.. హిందీ కవి ప్రదీప్ రాసిన ఈ పంక్తులతో మొదలయ్యే తీర్పు పాఠం బుల్డోజర్ విధాన రూపకర్తలకు గుణపాఠం. వ్యక్తులు, కుటుంబాల మౌలిక ఆకాంక్షలకు, సుస్థిరత, సురక్ష భావనలకు ఇల్లు అనేది ప్రతీక లాంటిదనడం ఒక ఆర్ద్రమైన నిర్వచనమే. అంతేకాకుండా అదొక ప్రాథమిక హక్కు అని తేల్చి చెప్పడం గమనార్హం.

నిజానికి కూల్చివేతలకు సంబంధించి నిర్దిష్టమైన విధివిధానాలు మన దేశంలో ఎప్పటి నుంచో అమల్లో ఉన్నాయి. ఎలాంటి కూల్చివేత అయినా అధికారులు ముందస్తు నోటీసు ఇచ్చి, దానికి సమాధానం ఇచ్చేందుకు 15 రోజుల వ్యవధి ఇవ్వడం తప్పనిసరి. కానీ, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని తోసిరాజని ఇష్టారాజ్యంగా ఇండ్ల మీదకు బుల్డోజర్లను నడిపిస్తున్నాయి. కుటుంబాలను, పిల్లాపాపలను వీధుల పాలుచేస్తున్నాయి. ఈ తరహా బుల్డోజర్ న్యాయాన్ని సుప్రీంకోర్టు ఎండగట్టడం గమనార్హం. ప్రజల హక్కులకు రక్షణగా నిలిచే మార్గదర్శకాలను సుప్రీంకోర్టు గుర్తు చేయాల్సిన పరిస్థితులు దేశంలో ఏర్పడటం దురదృష్టకరం. మనది చట్టబద్ధ పాలనతో కూడిన ప్రజాస్వామిక దేశం. మనకు ఓ రాజ్యాంగం ఉంది. అయినా ఏ చట్టాలతో ప్రమేయం లేకుండా పరిపాలనా విభాగం న్యాయవిధులను తన చేతుల్లోకి తీసుకుని నేరనిర్ధారణ చేయడం, శిక్ష పేరిట ఇండ్లు కూల్చడం వైపరీత్యమే. ఇది అరాచకం తప్ప మరోటి కాదన్న ధర్మాసనం వ్యాఖ్య ఓ కనువిప్పు. కేవలం నేరారోపణల ఆధారంగా పౌరుల నివాసాలను ఏకపక్షంగా కూల్చడం చట్టబద్ధ పాలన సూత్రాల ఉల్లంఘన, అంతిమంగా రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందనేది తీర్పు సారాంశం.

యూపీలో మొదలైన ఈ కూల్చివేతల దురాచారం క్రమంగా మధ్యప్రదేశ్ వంటి ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలకు వ్యాపించింది. ఈ తతంగమంతా మైనారిటీలు లక్ష్యంగా జరుగుతున్నదనే ఆరోపణలూ వచ్చాయి. ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం జలవనరుల పరిధిలోకి వస్తాయంటూ, అనుమతులు లేవంటూ రకరకాల కారణాలు చెప్తూ బుల్డోజర్ కూల్చివేతలకు తెగబడింది. ఏండ్లకేండ్లుగా నివాసముంటున్న కుటుంబాలను రాత్రికిరాత్రే గూడు చెదిరిన పక్షులుగా మార్చివేసింది. హైకోర్టు మందలింపుతో దూకుడు తగ్గించుకున్న సంగతి తెలిసిందే. తాజాగా వెలువడిన సుప్రీంకోర్టు తీర్పు విస్తృతస్థాయిలో నివాస హక్కును బలపరచడం ముదావహం.

# అభిప్రాయం చెప్పడమూ అపరాధమేనా?



డాక్టర్ అయాచితం శ్రీధర్
98498 93238

> రెండురెళ్లు నాల్గన్నందుకు
> గూండాలు గుండ్రాళ్లు విసిరే సీమలో
> క్షేమం అవిభాజ్యం అన్నందుకు
> జైళ్లు నోళ్లు తెరిచే భూమిలో
> అవినీతి భారీ పరిశ్రమలో
> అన్యాయాల ధరలు పెంచేసి
> స్వాతంత్ర్యాన్ని బ్యాంకుల్లో వేసుకుని
> చక్ర వడ్డీ తిప్పే కామందులకు
> క్షణక్షణం మారుతున్న లోకాన్ని
> సరిగా అర్థం చేసుకున్న వాళ్లంతా
> పేదల పక్షం వహించడమే
> పెద్ద అపరాధమైపోయింది. -శ్రీశ్రీ



ఎప్పుడో గత శతాబ్ది పూర్వార్ధంలో మహాకవి చెప్పిన ఈ మాటలు నేటికీ నిత్య సత్యాలుగా ముందు నిలుస్తున్నాయంటే రాజకీయ విలువలు, పరిపాలన ప్రమాణాలు ఎంతగా పతనం అవుతున్నాయో ఊహించవచ్చు. పాలకుల్లో విష సంస్కృతి పడగలెత్తిన వైనాన్ని గమనించవచ్చు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాలు గుర్తుచేసినా, ఎందుకు అమలు చేయడం లేదని నిలదీసినా క్షమించరాని నేరం అవుతున్నది. ప్రభుత్వ వైఫల్యాలను సామాజిక మాధ్యమాలలో ఎత్తిచూపినవారిపై, ఏకరువు పెట్టినవారిపై అధికార గణం ఒంటికాలు మీద లేస్తున్నది. 50 ఏళ్ల కిందటి ఎమర్జెన్సీ నీలి నీడలు తెలంగాణ అంతట పరుచుకుంటున్నాయి.

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నది. ఇంతవరకు పరిపాలన పట్టాలెక్కలేదు. వాగ్దానాలు నెరవేరలేదు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను రకరకాల కేసుల్లో ఇరికిస్తూ అరెస్టుల బూచిని చూపిస్తూ సంచలనాలు సృష్టించడం తప్ప.. 'ఎన్నికల్లో ప్రజలకేం చెప్పాం, ఇప్పుడేం చేస్తున్నాం' అనే ఆత్మవిమర్శ పాలకుల్లో పూర్తిగా లోపించింది. అమాయకంగా మాయమాటలు నమ్మి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చి అందలమెక్కించిన ప్రజలు దారుణంగా మోసపోయాం, వంచించబడ్డాం అంటూ వాపోతున్న దృశ్యాలు ఆగ్రహావేశాలు ఇవాళ రాష్ట్రంలో అడుగడుగునా ఆవిష్కృతమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు ఉద్యమాల ద్వారా, సామాజిక మాధ్యమాల ద్వారా తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. అది చట్ట ప్రకారం నేరం కానప్పటికీ, ప్రజాస్వామ్యబద్ధమే అయినప్పటికీ ప్రభుత్వం సహించలేక ఉక్కుపాదం మోపుతున్నది.

విమర్శలు ప్రతి విమర్శలు, సవాళ్లు ప్రతి సవాళ్లు, అమీతుమీ తేల్చుకోవడాలు, సాధింపులు, పగలు ప్రతీకారాలు రాజకీయాల్లో కొనసాగుతున్న వారికి కొత్తేమీ కాదు. కానీ, అత్త మీది కోపం దుత్త మీద తీర్చుకున్నట్టు సాధారణ ప్రజలను, బుద్ధిజీవులను లక్ష్యంగా చేసుకుని నిర్బంధించడం సమంజసం కాదు. కానీ, జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే ప్రభుత్వం పిచ్చుకలపై బ్రహ్మాస్త్రాలను ప్రయోగిస్తున్నదని స్పష్టమవుతున్నది. సంఘ విద్రోహ శక్తులపై, కరుడుగట్టిన నేరస్థులపై ప్రయోగించవలసిన భారత శిక్షాస్మృతి చట్టాలు దుర్వినియోగం అవుతున్నాయి. ఇది ఇవాళ కొత్త కాదు. కాంగ్రెస్ ప్రభుత్వాలు దశాబ్దాలుగా అనుసరిస్తున్న విధానమే. ఆ క్రమంలో ఎన్నెన్నో నిర్బంధ చట్టాలను కాంగ్రెస్ రూపొందించింది. ఆ చరిత్రలోకి వెళితే ఓ మచ్చుతునక...


> **1971 లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ప్రధాని ఇందిరాగాంధీకి ఎదురే లేకుండా పోయింది. సీనియర్ నేతలు కనుమరుగైపోయారు. ఇందిరమ్మ ఏం చేసినా చెల్లుతుందన్న అభిప్రాయం బలపడింది. పరిపాలనలో ప్రజాస్వామ్యం మసకబారి నియంతృత్వం తలెత్తింది. దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు పెల్లుబికాయి. వాటిని అణచివేసేందుకు 1975 జూన్ 25న ప్రధాని ఇందిరమ్మ అత్యవసర పరిస్థితిని (ఎమర్జెన్సీ) విధించారు.**

దేశవ్యాప్తంగా పత్రికలపై సెన్సార్‌షిప్, ప్రతిపక్ష నేతల అరెస్టులు, పౌరహక్కులపై ఆంక్షలు, ప్రజల నిర్బంధాలు ఏకంగా 20 నెలల పాటు దేశమే ఒక జైలుగా మారిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వం పట్ల ఆగ్రహంతో ఉన్న ప్రజలు తొలిసారిగా ఆ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించారు. తుదకు ప్రధాని హోదాలో ఉన్న ఇందిరమ్మ కూడా రాయబరేలి నియోజకవర్గంలో ఓడిపోయారు. తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ఆనాటి ఎమర్జెన్సీ రోజులను గుర్తుకుతెస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు తమ తీర్పును ఇచ్చేందుకు సమాయత్తమవుతున్నారు.

సోషల్ మీడియా వేదికగా తెలంగాణ ప్రభుత్వంపై వెల్లువెత్తుతున్న విమర్శలను, అభిప్రాయాలను సైతం సహించలేని స్థితిలో ప్రభుత్వం ఉన్నది. ప్రజల కష్టాలు నష్టాలు, సద్విమర్శలు, హామీలు నెరవేర్చాలన్న అభ్యర్థనలు కూడా నేరాలేనా? సంబంధిత వ్యక్తులు నేరస్థులేనా? అన్న ప్రశ్నలకు ప్రభుత్వం అవునేనని దబాయిస్తున్నది. అందుకు దృష్టాంతాలు కోకొల్లలు. కొణతం దిలీప్ ఐటీ రంగ నిపుణుడు, రచయిత, తెలంగాణ ఉద్యమకారుడు. కేసీఆర్ ప్రభుత్వంలో ఐటీ డైరెక్టర్‌గా ఆయన విశేష సేవలందించారు. మన్నె క్రిశాంక్ విద్యాధికుడు, తెలంగాణ ఉద్యమ నేత, జాతీయ మీడియా చర్చల్లో ప్రముఖంగా పాల్గొనే బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి. ఇంకా ఎందరో జర్నలిస్టులు, ఉద్యమకారులు, యువకులు పెట్టిన పోస్టులు అభ్యంతరకరమైనవి కాకపోయినా ప్రభుత్వం వారిపై అక్రమ కేసులు పెడుతున్నది. పద్ధతిగల సోషల్ మీడియా వారియర్లపై కేసులు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. బీఆర్ఎస్ నేతలపై అవాంఛనీయమైన పోస్టులతో విషం చిమ్ముతున్న వారిని చూసీచూడనట్లు వదిలేస్తున్నది.

వాస్తవానికి, సోషల్ మీడియా వికృత పోకడలకు మూలాలు ఆధిపత్య జాతీయ పార్టీలలోనే ఉన్నాయి. ప్రత్యర్థి పార్టీలను, ప్రాంతీయ పార్టీలను నిర్వీర్యం చేయడానికి వదంతులు, మార్ఫింగ్‌లు, అపోహలు, భయాలు, నిందలను సోషల్ మీడియా వేదికలపైకి రప్పించి, పెంచి పోషించిన ఘనత ఆధిపత్య జాతీయ పార్టీలదే. కేసీఆర్ పాలనపై, ఆయన కుటుంబంపై ఈ రెండు పార్టీలు ఏ స్థాయిలో బురదజల్లాయో సెల్‌ఫోన్ చేతిలో ఉన్న వారందరికీ తెలుసు. బీఆర్ఎస్ శ్రేణులు గాని, అభిమానులు గాని సోషల్ మీడియాను అలా దుర్వినియోగం చేయడం లేదు. సమంజసమైన, హేతుబద్ధమైన, ప్రజాస్వామికమైన తమ అభిప్రాయాలను సోషల్ మీడియా వేదికగా ప్రజలతో పంచుకుంటున్నారు. ఆ తేడా తెలియకుండా చావుకు, పెళ్లికి ఒకే మంత్రం అంటే ఎట్లా?

ప్రజల హక్కులకు, అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి భంగం వాటిల్లడం వల్ల వెలువడే ఆగ్రహజ్వాలలను చల్లార్చే శక్తి ఇంకా ఈ భూమ్మీద పుట్టలేదు. ప్రజాభిప్రాయం విత్తనం లాంటిది. భూమి పొరలను, రాళ్లను సైతం చీల్చుకుని అంకురించే శక్తి దానికి ఉంది. దానిని ఆంక్షలు అస్సలు ఆపలేవు.



# దిగుమతులతో దేశ భద్రతకు ముప్పు!

> **ఆధునిక కాలంలో ఎవరూ ఊహించని రీతిలో హెజ్బొల్లాపై ఇటీవల ఇజ్రాయెల్ చేసిన వినూత్నమైన దాడులు ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాయి. హెజ్బొల్లా తీవ్రవాదులే లక్ష్యంగా జరిగిన పేజర్లు, వాకీటాకీల పేలుళ్లలో ఆ సంస్థకు భారీ నష్టం జరిగింది. ఈ దాడుల్లో పదుల సంఖ్యలో మరణాలు సంభవించగా.. వేల మంది గాయాలపాలయ్యారు. ప్రధానంగా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న పరికరాలే లక్ష్యంగా జరిగిన ఈ దాడులు సరికొత్త భయాందోళనలకు దారితీశాయి. దిగుమతి చేసుకునే ఆయుధాల వాడకంపై అనుమానాలను రేకెత్తించాయి. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా రక్షణరంగ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉన్న నేపథ్యంలో దేశ భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.**

ఇజ్రాయెల్-హమాస్ మధ్య ఏడాది కిందట మొదలైన యుద్ధం క్రమంగా పశ్చిమాసియా అంతటా వ్యాపిస్తున్నది. ఈ యుద్ధంలో ఇరువైపులా భారీగా ప్రాణనష్టం సంభవించింది. ఈ నేపథ్యంలోనే ఇరాన్, లెబనాన్ లాంటి దేశాలు, హెజ్బొల్లా, హౌతీ లాంటి ఉగ్రవాద సంస్థలు పాలస్తీనాకు మద్దతుగా నిలిచాయి. లెబనాన్ పరోక్ష సహకారంతో ఇజ్రాయెల్‌పై మొదటినుంచీ హెజ్బొల్లా విరుచుకుపడుతున్నది. దాన్ని నిలువరించే క్రమంలోనే పేజర్లు, వాకీటాకీలను ఇజ్రాయెల్ పేల్చింది.

టెలిఫోన్లు, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు లాంటి అధునాతన కమ్యూనికేషన్ పరికరాలు అందుబాటులోకి వచ్చిన ఈ కాలంలోనూ హెజ్బొల్లా ఇప్పటికీ పేజర్లు, వాకీటాకీలనే వాడుతుండటం ఆశ్చర్యకరం. అత్యాధునిక పరికరాలను ఉపయోగించి హెజ్బొల్లా జరిపే అన్ని సంభాషణలను ఇజ్రాయెల్ ట్రాక్ చేస్తున్నది. ఈ కారణంగానే ఇజ్రాయెల్ వద్దనున్న ట్రాకింగ్ వ్యవస్థలకు చిక్కకుండా ఉండేందుకు దశాబ్దాల కిందటి పేజర్లనే హెజ్బొల్లా వినియోగిస్తున్నది. తయారీ సమయంలోనే పేజర్లను ట్యాంపర్ చేసి, వాటిలో చిన్న మొత్తంలో పేలుడు పదార్థాలను ఇజ్రాయెల్ అమర్చినట్టు తెలుస్తున్నది.

ఇప్పుడు ఈ అంశమే మన దేశం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని నొక్కిచెప్తున్నది. ఎందుకంటే, ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్నది మన దేశమే కావడం గమనార్హం. ప్రపంచ దిగుమతుల్లో భారత్ వాటా 9.8 శాతం. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రీ) ప్రకారం.. 2014-23 మధ్యకాలంలో బీజేపీ హయాంలో గతంతో పోలిస్తే 4.7 శాతం దిగుమతులు పెరిగాయి. భారత దిగుమతుల్లో 36 శాతం రష్యా నుంచి వస్తున్నవే. ఫ్రాన్స్, అమెరికాల వాటా 46 శాతం. అంతేకాదు, ఇజ్రాయెల్‌తో పాటు మరికొన్ని దేశాల నుంచి కూడా భారత్ ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్నది.

> **ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా లాంటి గొప్ప గొప్ప నినాదాలు ఇచ్చే మోదీ హయాంలోనే రక్షణరంగ దిగుమతులు మరింతగా పెరిగాయి. అదే సమయంలో బడ్జెట్‌లో రక్షణరంగ కేటాయింపులు భారీగా పడిపోయాయి. 2014లో మొదటిసారి మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో 17 శాతంగా ఉన్న రక్షణరంగ కేటాయింపులు తాజా బడ్జెట్‌కు వచ్చేసరికి 13 శాతానికి దిగజారాయి. అంతేకాదు, రక్షణరంగ వ్యయం జీడీపీలో 2 శాతం కంటే దిగువకు పరిమితమైంది.**

విదేశాల నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకుంటుండటం వల్ల మరో నష్టమూ జరుగుతున్నది. ఆలస్యం కారణంగా ఉత్పత్తులు సమయానికి అందుబాటులోకి రావడం లేదు. తేజస్ ఎంకే-1ఏ ఫైటర్ జెట్ విషయాన్నే తీసుకుందాం. ఈ ఫైటర్ జెట్ ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో చెప్పలేని పరిస్థితి. విదేశాల నుంచి దిగుమతి కావాల్సిన దాని ఇంజిన్ సమయానికి అందకపోవడమే అందుకు ప్రధాన కారణం. అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రిక్ సంస్థ ఇంజిన్‌ను సమయానికి అందించడంలో విఫలమవడంతో ఈ ఏడాది మార్చిలో అందుబాటులోకి రావాల్సిన ఈ ఫైటర్ జెట్ ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. జెట్ ఇంజిన్ ఉష్ణోగ్రతను గణించే ఓ చిన్న పరికరం కూడా ఇంకా దిగుమతి కాలేదు. ఇలా చిన్న చిన్న పరికరాల కోసం కూడా విదేశాలపై ఆధారపడటం మన రక్షణ రంగ దుస్థితికి నిదర్శనం.

పాకిస్థాన్‌కు అతిపెద్ద రక్షణ రంగ ఎగుమతిదారుగా ఉన్న చైనాలో తయారైన డ్రోన్ పరికరాలను దేశంలోని పలు కంపెనీలు దిగుమతి చేసుకుంటున్నాయి. డ్రోన్లలో వాడే కెమెరాలు, సాఫ్ట్‌వేర్, కమ్యూనికేషన్ పరికరాలకే ఈ నిషేధం పరిమితమైంది. హెజ్బొల్లాపై జరిగిన దాడుల నేపథ్యంలో ఇతర పరికరాలపై నిషేధం విధించడంతో పాటు దిగుమతులను కూడా భారీగా తగ్గించుకోవాల్సిన అవసరం ఉన్నది.

అయితే, దేశంలో ఒక్కసారిగా విదేశీ ఉత్పత్తుల దిగుమతులను తగ్గించడం అంత సులభం కాదు. దేశంలో ఉత్పత్తిని పెంచుకుంటూ క్రమంగా తగ్గించడం కష్టసాధ్యమూ కాదు. ప్రోటోటైప్ దశలో విదేశీ పరికరాలను వినియోగించడం వల్ల ఎలాంటి నష్టం ఉండదు. కానీ, ఉత్పత్తికి వచ్చేసరికి కచ్చితంగా దేశీయంగా తయారైన పరికరాలనే వాడాలి. అందుకు ఆత్మనిర్భర్ భారత్‌ను మరింత పటిష్ఠం చేయాలి. నినాదాలకే పరిమితమైపోయిన మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్‌లను క్షేత్రస్థాయిలోనూ అమలు చేయాలి. అందుకు బడ్జెట్ కేటాయింపులను పెంచడంతో పాటు ప్రభుత్వ రక్షణరంగ సంస్థలను బలోపేతం చేయాలి. దాంతో పాటు ప్రైవేట్ పెట్టుబడులకు కూడా ఎర్రతివాచీ పరచాలి. అప్పుడే దిగుమతుల తగ్గింపుతో పాటు దేశీయ ఉత్పత్తి లక్ష్యాన్ని కూడా చేరుకోగలం.



ఎడిటోరియల్ డెస్క్

**ప్రతీక్ జైన్.. మా వికారాబాద్ జిల్లా కలెక్టర్. మంచి మనసున్న ఆఫీసర్. నియోజకవర్గ సమస్యల మీద ఆయనను కలిసిన నాయకుల అనుభవంలో కలెక్టర్ గారు చాలా డౌన్ టు ఎర్త్ మనిషి! తాము లేవనెత్తిన సమస్యల గురించి సావధానంగా వినడం, పరిష్కారం కోసం ప్రయత్నించడం గురించి తాండూరులో మంచిగా చెప్తుంటరు.**

# తిరగబడ్డ కొడంగల్



శ్రీశైల్‌రెడ్డి పంజుగుల
90309 97371

కేసీఆర్ హయాంలో భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా ప్రతీక్ జైన్ అందించిన సేవలను అక్కడి గిరిజనులు ఎప్పటికీ మరువలేరు. పాలకుడు దార్శనికుడు, సహృదయుడు అయితే అధికారులతో గొప్ప పనులు చేయించవచ్చు. భావోద్వేగియే కానీ, అవినీతి, అక్రమాల మరకలంటని ఎన్టీఆర్ హయాంలోని ఆఫీసర్లు యూబీ రాఘవేంద్రరావు, శ్రవణ్ కుమార్ (వీద్దరూ సీఎస్‌లు) సహా ఆ తర్వాతి కాలంలో మోహన్ కందా, మొహంతి, కాకి మాధవరావు వంటి ఎందరో అధికారులు పాలనకు వన్నె తెచ్చారు. ఆరోపణలకు ఎదురొడ్డి నిలిచి సోమేశ్‌కుమార్, రామకృష్ణారావు లాంటి కార్యనిర్వాహకులు శాసన వ్యవస్థకు దన్నుగా నిలబడ్డారు.

ఏ విలువలూ లేని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ తప్పిదాలకు మంచి ఆఫీసర్లు బలవుతున్నరు. 'నాపై జరిగింది దాడిగా చూడవద్దు' అని కలెక్టర్ ప్రతీక్ అన్నారంటే ఆయన మనసు ఎంత తడి ఉండాలి? ఇప్పుడు ఆయనపై కూడా రైతు వ్యతిరేకి ముద్ర వేయించింది కాంగ్రెస్ సర్కారు. వాస్తవానికి, రైతులు దాడి చేసింది ముఖ్యమంత్రిపై. ఆయన సీన్‌లో లేడు కాబట్టి, అధికారి వెంకటరెడ్డిపై దాడి చేశారు కడుపు మండి. కలెక్టర్‌ను కారు ఎక్కించి క్షేమంగా తిరిగి పంపించారు.

రగచర్ల ఘటన తర్వాత సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి మాట్లాడిన మాటలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. 'ఎవరు అడ్డు వచ్చినా పరిశ్రమలు ఆగవు' అంటున్నరాయన. ఒక పదవి, ఒక ప్రోటోకాల్ లేని తిరుపతిరెడ్డి అట్లా మాట్లాడుతున్నా.. అవి వింటూ పోలీసులు, మీడియా, మేధావులూ మౌనంగా ఉన్నారు. వారి మౌనాన్ని చూసి పేద ప్రజలు భయపడరా? బిక్కుబిక్కుమనరా? ఆ మధ్య వారి సోదరుల దాష్టీకం గురించి రేవంత్‌కు చెబుదామని పోయిన ఒక కాంగ్రెస్ నాయకునితో.. 'ఈ రాష్ట్రానికి నలుగురు ముఖ్యమంత్రులమయ్యా. చల్..' అంటూ అంటూ ఇక్కడ రాయలేని మాటలు అన్నరట. ఆ నాయకుని వలపోత ఇది. ఇది 'hearsay' కావచ్చు గానీ, 'ప్రభుత్వ ఉద్యోగులు మన పక్షాన ఉన్నర'ని పొన్నం ప్రభాకర్ అంటే.. అసభ్య పదజాలంతో సీఎం రేవంత్ స్పందించడం మనమంతా చూశాం, విన్నాం కదా!

> **సీఎం, ఆయన సోదరుల దౌర్జన్యాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. వారికి జంకి అధికారులు కూడా మౌనముద్ర వహిస్తున్నారు. అధికారులపైకి పేపర్లు విసిరిన రాజగోపాల్ రెడ్డి, సీఐ సీటులో కూర్చొని రుబాబ్ చూపిన సురేఖ లాంటి ఉదాహరణలు చదువరులకు ఎన్నో తడతాయి.**




మొన్న ఒక అంశంపై అన్యాయపు అభియోగాలు ఎదుర్కొంటున్న కేటీఆర్ అప్పటి తమ శాఖ కార్యదర్శి అర్వింద్ కుమార్ ప్రభుత్వం చెప్పిందే చేశారు తప్ప, ఆయన తప్పేమీ లేదని చెప్పడం నాయకుల ఉదాత్తతకు నిదర్శనం. కేసీఆర్ వారసత్వం ఉన్న కేటీఆర్ మాత్రమే కాదు; కేసీఆర్ తాత్విక చింతన తెలిసిన, ఒంటబట్టించుకున్న ఆయన సహచరులు, అనుచరులు ఎవ్వరూ అధికార, ప్రతిపక్ష బాధ్యతల్లో లక్ష్మణ రేఖ దాటి ఎరుగరు. ప్రజాగ్రహాన్ని పట్టించుకోకుండా సీఎం కుటుంబం, క్యాబినెట్ ఇష్టం వచ్చినట్టు కూస్తున్నరు. బీటలు వారుతున్న వారి పాలనాసౌధానికి రిపేర్లు సాధ్యం కావు. బీఆర్ఎస్ నాయకులో, కార్యకర్తలో చెబితే అధికారులపై దాడులు చేసేంతగా ప్రజలు రోసిపోయి ఉంటే... రాబోయే ఎన్నికల్లో 119 సీట్ల గెలుపు బీఆర్ఎస్‌కు నల్లేరు మీద నడకే!

సర్వ భ్రష్టతనొందిన కాంగ్రెస్ సర్కారును కొడంగల్ ఉరికించి కొట్టింది. ఇంట ఓడిన ఓ రచ్చ రాజా.. బయటా పరాభవాలకు సిద్ధపడు!

# కాంగ్రెస్‌కు నాయకుల కొరత



కన్నోజు మనోహరాచారి
79950 89083



కేంద్రంలో అధికారంలోకి రావడమే పరమావధిగా భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ తన గతాన్ని పూర్తిగా మరిచిపోయింది. అంతేకాకుండా, పరిపక్వత కలిగిన లీడర్లు లేని పార్టీగా చరిత్రలో నిలిచిపోయే దిశగా పయనిస్తున్నది. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పీవీల హయాంలో భారత్ అద్భుతమైన ప్రగతిని సాధించింది. నెహ్రూ శాస్త్ర సాంకేతిక రంగాలకు ఇతోధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఇస్రో, బీహెచ్ఈఎల్, డీఆర్‌డీఎల్ లాంటి సంస్థలను నెలకొల్పారు. భాక్రానంగల్, నాగార్జునసాగర్ తదితర భారీ సాగునీటి ప్రాజక్టులకు ఆయన రూపకల్పన చేశారు.

ఇందిరాగాంధీ హయాంలో గ్రీన్ రెవల్యూషన్ ఊపందుకున్నది. రాజీవ్‌గాంధీ కాలంలో టెలికమ్యూనికేషన్ వ్యవస్థ వృద్ధిచెందింది. పీవీ హయాంలో భారత ఆర్థిక వ్యవస్థ వేగం పుంజుకున్నది. ఇంతటి ఘన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ నేడు దేశాభివృద్ధిని గాలికి వదిలివేసింది. ప్రజలకు ఉచితాలను ఎరగా వేస్తూ అధికారంలోకి రావడానికి అవస్థలు పడుతుండటం శోచనీయం.

> **ఇప్పుడు మల్లికార్జున ఖర్గే మాత్రమే ఆ పార్టీకి ఏకైక రాజకీయ నాయకుడు, సలహాదారుడు. దేశం గురించి, దేశ ఆర్థికవ్యవస్థ గురించి పట్టించుకోకుండా ఉచితాల పేరుతో ప్రజలను మోసం చేస్తూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్నారు.**

గద్దెనెక్కడమే లక్ష్యంగా కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్‌లో ఇచ్చిన గ్యారెంటీలకే దిక్కు లేదు. వాటిని అమలుచేయలేక ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అవస్థలు పడుతున్నాయి. సాక్షాత్తూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులపై అవగాహన లేకుండా హామీలు ఇవ్వకూడదని హితవు పలికారు. అయినా ఆ పార్టీ నాయకత్వానికి బుద్ధి రావడం లేదు. త్వరలో జరగబోయే మహారాష్ట్ర ఎన్నికల్లో కూడా ఆ పార్టీ హామీల వర్షం కురిపించింది. మహిళలకు ఉచిత బస్సు, రూ.500కే ఏటా ఆరు గ్యాస్ సిలిండర్లు, రైతులకు రూ.3 లక్షల రుణమాఫీ, డిగ్రీ పూర్తిచేసిన నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి, ఏటా రెండున్నర లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, వంద యూనిట్ల వరకు ఉచిత కరెంట్.. ఇలా ఎన్నో హామీలను కాంగ్రెస్ గుప్పించింది. తెలంగాణలో ఏ ఒక్క హామీ అమలుకాలేదు.

ఉచితాలు, సబ్సిడీల పేరుతో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కొన్ని లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసింది. ఇలాంటి తాయిలాలు కాకుండా ఆర్థిక వనరులను పెంపొందించే శాశ్వత పరిశ్రమలు, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, రోడ్డు రవాణా సౌకర్యాలు, అడవుల విస్తరణ, దవాఖానలు, విద్యాలయాలు, విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు, వ్యవసాయ అనుబంధ రంగాలు, టూరిజం, సమాచార సాంకేతిక రంగాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ప్రజలూ అవే కోరుకుంటున్నారు. భవిష్యత్తు తరాలకు కావాల్సిన అవసరాలను తీర్చాలి. వాటిని సమకూర్చే నాయకులు ఇప్పుడు దేశానికి కావాలి.

ప్రస్తుతం దేశం గురించి ఆలోచించే నాయకులు ఎవరూ కాంగ్రెస్ పార్టీలో మచ్చుకైనా కనపడటం లేదు. ఆ పార్టీ నాయకులకు దేశ ఆర్థిక వ్యవస్థపై సమగ్ర అవగాహన లేదు. హస్తం పార్టీ మళ్లీ బలపడాలంటే దూరదృష్టి కలిగిన నాయకుడు కావాలి. దేశాన్ని ముందుకు నడిపించే ధీశాలి కావాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేండ్లు పూర్తయ్యే నాటికి మనం ఇంకా ఏం సాధించాలి? అని ఆలోచించే నేతలు ఆ పార్టీకి కావాలి. కాంగ్రెస్ పార్టీయే కాదు, ఏ పార్టీ అయినా ఇలా గొప్ప ఆలోచనలతో ముందుకు వచ్చినపుడే ప్రజలు ఆదరిస్తారు.

